ఆందోళన చెందవద్దు.. మళ్లీ దరఖాస్తు చేసుకోండి : అదనపు కలెక్టర్

కొల్చారం, జనవరి 23 ప్రభాతవార్త: అర్హులైనవారికి ప్రభుత్వం అందచేస్తున్న సంక్షేమ పథకాలు అందుతాయని, ఎవరూ ఆందోళన చెందవద్దని, మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్‌గౌడ్ అన్నారు. గురువారం కొల్చారం మండలం కిష్టాపూర్ గ్రామంలో తహసీల్దార్ గఫర్‌మియా అధ్యక్షత ప్రజాపాలన గ్రామసభ ఏర్పాటుచేశారు.ఇందిరమ్మ ఆత్మీయభరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎంపికైన వారి జాబితాను గ్రామసభలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్‌గౌడ్ మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ నుంచి సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఎలాంటి వ్యవసాయ భూమి లేకుండా 2023-24లో కనీసం 20 రోజుల పాటు ఉపాధి హామీలో పనులు చేసి ఉన్న వ్యవసాయ కూలీలకు నెలకు రూ. 1000 ఇందిరమ్మ ఆత్మీయభరోసా కింద పంపిణీ చేయనున్నామన్నారు. రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతుభరోసా నిరంతరం కొనసాగే ప్రక్రియ అని అన్నారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ గఫర్ మియా, గ్రామ కార్యదర్శి మమత, ఈజీఎస్ సిబ్బంది, వ్యవసాయ అధికారులు, అంగన్వాడీ టీచర్లు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మల్లేష్ గౌడ్, గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి..రోడ్డు నిబంధనలు పాటించాలి

డిఎస్‌పి పుష్పకుమార్

సంగారెడ్డి టౌన్, జనవరి 23, ప్రభాతవార్త:

విద్యార్థులకు మత్తు పదార్థాలకు (డ్రగ్స్)కు దూరంగా ఉండాలని, రోడ్డు నిబంధనలు పాటిస్తూ ప్రయాణాలు కొనసాగించాలని టిఎస్ఎన్ఎబి డిఎస్‌పి పుష్పకుమార్ సూచించారు. గురువారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని పిఎఇఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి 7వందల మంది విద్యార్థులు హాజరు అయ్యారు. విద్యార్థులను ఉద్దేశించి పుష్పకుమార్ మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగంతో డబ్బులు ఖర్చు కావడంతో పాటు ఆరోగ్యం దెబ్బతింటుందని గుర్తు చేశారు. ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి ఒక్కరు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. రోడ్డు మీదకు వెళ్లిన వారు తమ తమ ఇండ్లకు సురక్షితంగా చేరుకునేందుకు రోడ్డు నిబంధనలు విధిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో ఇన్స్ పెక్టర్ రాము, సంగారెడ్డి రూరల్ సిఐ క్రాంతి కుమార్, ట్రాఫిక్ సిఐ సుమన్, సంగారెడ్డి రూరల్ ఎస్ఐ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సుల్తాన్‌పూర్ శివారులో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి దామోదర్

ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు 6.26 ఎకరాలు కేటాయింపు

-రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్

చౌటకూరు, జనవరి 23, ప్రభాతవార్త: మండలానికి అవసరమై ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు 6.26 ఎకరాల భూమిని కేటాయిస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి దామోదర్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామ శివారులో 44 సర్వే నంబరులో స్థలాన్ని పరిశీలించారు. మండల కేంద్రమైన చౌటకూరులో మండల పరిషత్ కార్యాలయం, రెవిన్యూ, వ్యవసాయ శాఖ, ఎంఈఓ కార్యాలయాలు ఉంటాయని మంత్రి దామోదర్ పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు సరిపోను స్థలం అందుబాటులో లేక సుల్తాన్‌పూర్ గ్రామ శివారులో పోలీసు స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణాలకు ఎకరం చొప్పున, కస్తూర్బా గాంధీ పాఠవాల నిర్మానానికి 4.26 ఎకరాల భూమిని కేటాయించడం జరిగిందన్నారు. ఫిబ్రవరి మాసంలో భవనా నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ పాండు, సంగారెడ్డి డిఎస్‌పి సత్తయ్యగౌడ్, తహసీల్దార్ మన్నె కిరణ్‌కుమార్, జోగిపేట సిఐ అనిల్‌కుమార్, పుల్‌కల్ ఎస్ఐ క్రాంతి కుమార్ పాటిల్, సర్వేయర్ ప్రభాకర్, ఆర్ఐ రాజు, సుల్తాన్‌పూర్ మాజీ ఉప సర్పంచ్ గండనోల్ల శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సురేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ డివిజన్ కార్యాలయ ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

అల్లాదుర్గం, జనవరి 23, ప్రభాతవార్త: అల్లాదుర్గం సబ్ డివిజన్‌లో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం కొరకు గురువారం మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులతో కలిసి స్థలాలను పరిశీలించారు. గురుకుల పాఠశాల, ఐటిఐలకు నూతన భవనాల నిర్మాణానికి గ్రామ శివారులోని ఒడ్డుపోతుల దగ్గర ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఎస్‌టిఓ, ఐసిడిఎస్, ఎంపిడిఓ తదితర కార్యాలయాల భవన నిర్మాణాలకు తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ప్రభుత్వ భూమిని పరిశీలించారు. పరిశీలించిన స్థలాలకు సంబంధించి పూర్తి వివరాలతో కూడిన ప్రతిపాదనలు సిద్ధంచేయాలని రెవెన్యూ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లయ్య, ఆర్ఐ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా వెల్దుర్తి గ్రామసభ

-కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపిల బాహాబాహీ

వెల్దుర్తి, జనవరి 23 ప్రభాతవార్త: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందాలని రాష్ట్ర వ్యాప్తంగా గ్రామసభలను నిర్వహిస్తుంది. మండల కేంద్రమైన వెల్దుర్తిలో గురువారం జరిగిన గ్రామసభ రసాభాసగా మారింది. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, రైతుభరోసా, ఇందిరమ్మ భరోసా వంటి పథకాలకు సంబంధించిన పేర్లను గ్రామసభలో ఈవో బలరాంరెడ్డి చదివారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ, ఆర్ఐ నర్సింగ్‌యాదవ్, వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి మజీద్ పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ ఈవో బలరాంరెడ్డి లబ్ధిదారుల పేర్లను చదువుతుండగా ఒక ఇంట్లో ఇద్దరికీ, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు వచ్చాయని, అర్హులకు కాకుండా అనర్హులకు ఎక్కువశాతం వచ్చాయని అధికారులపై నాయకులు మండిపడ్డారు. భూములు, ఇళ్లు ఉన్నవారికి వచ్చాయని, నిరుపేదలకు, గుడిసెలు ఉన్నవారికి రాలేదని అధికారుల తీరు పట్ల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సరైన లబ్ధిదారులకు అందేలా చూడాలని తెలిపారు. దీంతో కాంగ్రెస్ నాయకులు, మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్ కలుగజేసుకొని పది సంవత్సరాల కాలంలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, తాము ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశంతోనే గ్రామసభలు నిర్వహించి అందిస్తున్నామని అన్నారు. దీంతో బీఆర్ఎస్ నాయకుడు మోహన్ రెడ్డి కలుగజేసుకొని గతంలో మేము ఇవ్వలేదు కాబట్టి ఇప్పుడైనా సరైన లబ్ధిదారులకు వచ్చే విధంగా చూడాలని, అనర్హులకు ఎక్కువ శాతం వస్తున్నాయని, అర్హులకు రావడంలేదని ఆయన మండిపడ్డారు. బీజేపీ మాజీ పట్టణ అధ్యక్షుడు శేఖర్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ కార్యకర్తలకు ఇళ్లు, రేషన్ కార్డులు ఇతర సంక్షేమ పథకాలు ఇస్తున్నారని ఆందోళన చేశారు. మూడు పార్టీల వారు కలుగజేసుకోవడంతో గందరగోళంగా మారడంతో స్థానిక తాహశీల్దార్ కృష్ణ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. అనంతరం గ్రామసభలో తాహశీల్దార్ మాట్లాడుతూ ఇది నిరంతర ప్రక్రియ అని, పేర్లు రాలేదని లబ్ధిదారులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, పేరు రాని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

ప్రభుత్వ పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలి

నర్సాపూర్, జనవరి 23, ప్రభాతవార్త : గ్రామసభల్లో ప్రకటించిన లిస్టులో పేర్లు లేనివారు ప్రభుత్వ పథకాలకోసం దరఖాస్తు చేసుకోవచ్చని 2వ వార్డ్ కౌన్సిలర్ లతరమేష్‌యాదవ్ సూచించారు. గురువారం కౌన్సిలర్ లతారమేష్ అధ్యక్షతన ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి స్పెషల్ ఆఫీసర్‌గా మున్సిపల్ మేనేజర్ మధుసూదన్, వార్డు ఆఫీసర్ ఆంజనేయులు, దుర్గేష్ పాల్గొన్నారు. వార్డ్ కౌన్సిలర్ లతారమేష్ యాదవ్ మాట్లాడుతూ ప్రజలు కొత్త రేషన్ కార్డులో పేర్లు లేని వారి పేర్లు చేర్పించటానికి, అలాగే ఇల్లు లేనివారు ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. కొత్త రేషన్‌కార్డులకు 72, రేషన్ కార్డులో పేరు మార్పులకు 34, షిఫ్టింగ్ కు 8, ఇందిరమ్మ ఇండ్ల కోసం 93 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. లిస్టులో పేరు లేని పదిమంది కూడా తెలిపారు.ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వార్డు ప్రజలకు లతరమేష్‌యాదవ్ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వార్డు ప్రజలు మున్సిపల్ సిబ్బంది వార్డు అధికారులు పాల్గొన్నారు.

ప్రతీ గ్రామానికి ఆర్టీసి బస్సులు నడిపిస్తాం

మహాలక్ష్మి పథకంలో లాభాల బాట పట్టిన ఆర్టీసీ.. రవాణా,బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ రూరల్, జనవరి 22,ప్రభాతవార్త

నియోజకవర్గంలోని 169 గ్రామాలను ఆర్టీసీ బస్సులు నడిచేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం హుస్నాబాద్‌లో రూ.2 కోట్లతో పునరుద్ధరింపబడిన బస్టాండ్‌ను జిల్లా కలెక్టర్ మనుచౌదరితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలో మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సులలో 134 కోట్ల మంది మహిళలను గమ్యస్థానాలకు చేర్చి 450 ఆదాయాన్ని సమకూర్చి నష్టాలలో ఉన్న ఆర్టీసీని లాభాల బాటలో పట్టించామన్నారు. ప్రజలను గమ్యస్థానాలకు చేర్చేందుకు డ్రైవర్లు, కండక్టర్లు చేస్తున్న కృషికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే హుస్నాబాద్‌లోని 129 రెవెన్యూ గ్రామాలకు హుస్నాబాద్ డిపో బస్సులు నడుస్తున్నాయని, మిగిలిన ప్రతీ గ్రామానికి కనీసం ఒక్కసారైనా నడిచే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ప్రతీ గ్రామానికి బస్సులు నడిపి ప్రజలను క్షేమంగా గమ్య స్థానాలకు చేర్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. హైదరాబాద్‌లో కాలుష్య నివారణ కోసం ఎలక్ట్రిసిటీ బస్సులను ఏర్పాటు చేసి నడుపుతున్నామన్నారు. పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో నష్టాల బాటలో ఉన్న సంస్థను లాభాల బాటలోకి తేవడంతో పాటు పదేళ్లలో ఎప్పుడూ లేని విధంగా ప్రయాణికుల సౌకర్యార్థం 2 వేల బస్సులు కొనుగోలు చేసి నడుపుతుండడంతోపాటు మరో 600ల బస్సులను మహిళా సంఘాల ద్వారా కొనుగోలు



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

చేయబోతున్నామన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మీ పథకం ద్వార ఎన్నో రోడ్డు ప్రమాదాలు తప్పాయన్నారు.ప్రతీ బస్సులో 100మంది ప్రయాణికులు ప్రయాణిస్తుంటే అందులో 65 మంది మహిళలే వెళ్తున్నారని అధికారులు చెబుతున్నారని ఇది సంతోషకరమైన విషయమన్నారు.ఆర్టీసీ కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు పోతుందని అందులో భాగంగానే ప్రధాన సమస్యగా ఉన్న కారుణ్య నియామకాలు చేపట్టామని, త్వరలో 3 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ వేయబోతున్నామన్నారు.హుస్నాబాద్ డిపో 1984లో ఏర్పాటు చేసిన సమయంలో ఇక్కడ మొదటి డిఎంగా విధులు నిర్వహించిన అధికారి ఇప్పుడు ఆర్టీసి ఈడిగా ఉండడం సంతోషకరమైన విషయమన్నారు.

డిపో అభివృద్ధిలో ఈడి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని, బస్టాండ్‌తో పాటు హుస్నాబాద్ డిపోను మరింత అభివృద్ధి చేసే భాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు.జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా ప్రతీ వాహన దారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం తాగి వాహనాలు నడవద్దన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల రోజు జరుగుతున్న ప్రమాదాలు ఈ ప్రమాదాల వల్ల కొందరు మరణిస్తే మంతో మంది కుంటుబాలకు బారంగా జీవిస్తున్నారని ఇంకోకరి జీవితాలు బలికావడానికి ఏ ఒక్కరు కూడా కారణం కావద్దన్నారు. ఆర్టీసీ కార్మికులు, డ్రైవర్లు, కండక్టర్లను ప్రభుత్వం కాపాడుకుంటుందని ఆయన స్పష్టం చేశారు.ఎవరికి ఎలాంటి సమస్య ఉన్నా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. హుస్నాబాద్ డిపోను ఆదర్శవంతమైన డిపోగా తీర్చిదిద్దేందుకు ప్రతీ అధికారి పనిచేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా లైబ్రరీ చైర్మన్ కేదం లింగమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత వెంకన్న, వైస్ చైర్మన్ అనిత శ్రీనివాస్‌రెడ్డి, చీఫ్ సివిల్‌ఇంజనీర్ శ్రీనివాస్ రావు, రీజినల్ మేనేజరు బి.రాజు, డిప్యూటీ ఆర్ఎంవో ఆపరేషన్ భూపతి రెడ్డి, డిప్యూటి ఆర్ఎం సత్యనారాయణ, హుస్నాబాద్ డిఎం వెంకటేశ్వర్లుతో పాటు కరీంనగర్ 1,2, హుజురాబాద్ డిపోల మేనేజర్లు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో వ్యక్తిగత దాడులకు తావులేదు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు, జనవరి 22,ప్రభాతవార్త:

ప్రజలు రెండుసార్లు చీకొట్టినా బుద్ధి మారకుండా తిరిగి నియోజకవర్గంలో శిఖండి రాజకీయాలు చేస్తూ వ్యక్తిగత దాడులకు పాల్పడడం మానుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్‌కు సూచించారు.గురువారం పటాన్‌చెరులోని క్యాంపు కార్యాలయంపై కాట శ్రీనివాస్‌గౌడ్‌వర్గానికి చెందిన వ్యక్తులు దాడి ఘటనను నిరసిస్తూ ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎమ్మెల్యే నివాసం ఉండే క్యాంపు కార్యాలయంపై కార్యకర్తలను రెచ్చగొట్టి దాడులకు దిగడం ప్రజాస్వామ్యానికి ప్రమాదమన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో మూడుసార్లు గెలిచి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా ప్రజల హృదయాలను గెలుచుకోవడం జరిగిందని తెలిపారు. కాట శ్రీనివాస్‌గౌడ్‌కి అమీన్‌పూర్ సర్పంచ్‌గా ప్రజలు అవకాశం అందిస్తే నిధులు పక్క దారి పట్టించి జైలు పాలు కావడంతోపాటు, రెండుసార్లు ఎమ్మెల్యేగా పోటీచేసి దారుణ ఓటమికి గురైన వ్యక్తులు నేడు తనపై వ్యాఖ్యలు చేయడం సిగ్గుగా ఉందన్నారు. తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి నీచ రాజకీయాలను చూడలేదన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలలో ప్రొటోకాల్ ప్రకారం మాత్రమే ఆహ్వానాలు అందజేశారు తప్ప, పార్టీలకు అనుగుణంగా నిర్వహించడం జరుగుతుందా అని ప్రశ్నించారు. తమ కార్యకర్తలు ప్రతిఘటిస్తే పరిస్థితులు ఎలా ఉండేవని ప్రశ్నించారు. తన కార్యకర్తలు తమ మీద ఒత్తిడి చేసిన నేను వాళ్ళను కంట్రోల్ చేసుకుంటూ అక్కడికి ఎవరిని రాకుండా ఎలాంటి హింస వాతావరణం చోటు చేసుకోకుండా నియంత్రించానని వెల్లడించారు. ఇలాంటి దాడుల సంస్కృతి పటాన్ చెరు ప్రాంతంలో ఇప్పటివరకు లేదని, తమ ఓపికను పరీక్షిస్తే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృత్తం చేస్తే చూస్తూఊరుకోబోమని అందుకు తగ్గ మూల్యం చెల్లిస్తామని తీవ్రంగా రియాక్టయ్యారు. క్యాంపు ఆఫీసుపై దాడి చేసిన దుండగులపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలని వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని పోలీసులను డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

ఈ ఘటనపై ఇప్పటికే ఐజి సత్య నారాయణ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి సైతం ఫిర్యాదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ప్రజా ప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎర్రమట్టి దొంగలు

-మూడు పూలు ఆరు కాయలుగా నడుస్తున్న మైనింగ్ దందా

-చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

గజ్వేల్, జనవరి 23 (ప్రభాతవార్త):

గజ్వేల్ నియోజకవర్గంలో విచ్చలవిడిగా ఎర్ర మట్టి దందా చేస్తూ మూడు పూలు ఆరు కాయలుగా దందా కొనసాగిస్తున్నారు.ఎక్కడ చూసినా పెద్ద పెద్ద గుంతలు తవ్వి మట్టిని, మొరంను తరలించడంతోపాటు చెరువులు, కుంటలు, ప్రైవేట్ భూములలో సైతం యధేశ్చగా మట్టి తవ్వకాలు చేపట్టి అడ్డగోలుగా మట్టి వ్యాపారం చేస్తున్నారు. నియోజకవర్గంలోని పలు మండలాల పరిధిలో ఉన్న చెరువు, కుంటలలో రేగడి మట్టిని తీస్తూ హైదరాబాద్‌తోపాటు ఇతరజిల్లాలకు ఇటుక బట్టీలకు పెద్ద మొత్తంలో తరలిస్తున్నారు. ఒక్కో ట్రిప్పు రూ.13 వేల నుంచి రూ.15వేల వరకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరించడంతో వారి మట్టి దందా మూడు పూలు ఆరుకాయలుగా నడుస్తుంది. మట్టి తవ్వకాలవల్ల భూగర్భ జలాలు అడుగంటిపోతాయని నిపుణులు చెప్తున్నప్పటికీ అవేమీ పట్టించుకోకుండా మైనింగ్ మాఫియా విచ్చలవిడిగా తవ్వకాలు జరుపుతున్నారు. ఏ గ్రామంలో చూసినా చెరువు కుంటల్లో, ప్రైవేట్ భూములలో జెసిబిలు, టిప్పర్లు దర్శనమిస్తున్నాయి. ములుగు, వర్గల్, మర్కుక్ మండలాల పరిధిలో మాత్రం నూతనంగా నిర్మాణం చేపడుతున్న పరిశ్రమలకు అడ్డగోలుగా మట్టిని తరలిస్తున్నారు. చిన్నచితకా టిప్పర్‌తో మట్టి దందాలు చేసే వారికి పనిలేకుండా బడాబాబులు మట్టిదందాలు కొనసాగిస్తున్నారు. సొంత భూముల్లోనూ మట్టిని తీయాలంటే అనుమతులు తప్పనిసరి అని అధికారులు అంటున్నప్పటికీ రాత్రికి రాత్రి ఎవరికంట పడకుండా టిప్పర్ల ద్వారా వందల ట్రిప్పుల మట్టిని తరలిస్తున్నారు.ఈ మధ్య ఎర్ర మట్టికి భలే గిరాకీ ఉండడంతో ఏకంగా చదును చేసే భూములను సైతం పెద్ద పెద్ద జెసిబిలతో తవ్వి గుంతలుచేసి మరీ ఎర్ర మట్టిని అమ్ముకుంటున్నారు. ఈ మధ్యకాలంలో టాస్క్‌ఫోర్స్, పోలీసు అధికారులు అడపా దడపా మట్టి దందా నడిపించే టిప్పర్లు, జెసిబిలను సీజ్ చేసినప్పటికి మైనింగ్ మాఫియా మాత్రం ఆగడంలేదు. మట్టి దందా చేసేవారు స్థానిక ప్రజా ప్రతినిధులకు, ఆ గ్రామాలకు చెందిన నాయకులకు ముడుపులు చెల్లించి చెరువల నుండి రాత్రికి రాత్రే హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు అధిక ధరలకు మట్టిని తరలిస్తున్నట్లు సమాచారం. అధికారులు ఎన్నిసార్లు సీజ్ చేసినప్పటికీ మైనింగ్ దందాను పూర్తిగా అరికట్టలేకపోతున్నారు. నియోజకవర్గ పరిధిలోని పలు మండలాల్లో ఎక్కడ చెరువు చూసినా భారీ గుంతలు కనిపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో మిషన్ కాకతీయ పేరిట చెరువు కుంటలను ఎత్తుపల్లాలు లేకుండా సుందరంగా తయారుచేస్తే మైనింగ్ మాఫియా అక్రమంగా మట్టిని తవ్వి తరలించడంతో చెరువు కుంటలు లోయలుగా మారిపోయాయి. రేగడి మట్టి ఇటుక బట్టీలకు అవసరముండడంతో ఎవరు పడితే వారు ఎక్కడ పడితే అక్కడ జెసిబిలు, టిప్పర్లు పెట్టి అనుమతులు లేకుండా ఇష్టం వచ్చినట్లు మట్టిని తరలిస్తున్నారు.

అర్ధరాత్రి అయితే చాలు రోడ్డు మీద మట్టి టిప్పర్లే ఎక్కువగా కనిపిస్తున్నాయి. మైనింగ్ మాఫియా చేస్తున్న ఆగడాలను అధికా రులు అడ్డుకోకపోతే రాబోయే రోజుల్లో భూగర్భ జలాలు అడుగంటిపోతాయని పలువురు అంటు న్నారు. అంతేకాకుండా చెరువులు, కుంటల్లో మట్టిని తవ్వడంవల్ల పశువులకు, ప్రజలకు చెరువు లోతు తెలయకుండా అందులో పడి మరణించే ప్రమాదాలు ఎక్కువగా ఉంటాయని, ఇప్పటికైనా అధికారులు మైనింగ్ మాఫియాపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.



ప్రైవేట్ భూమిలో ఎర్రమట్టిని తవ్విన దృశ్యం

చెరువు వద్ద జెసిబితో మొరం మట్టిని తవ్వి టిప్పర్‌లో పోస్తున్న దృశ్యం

గ్రామసభల్లోనఅనర్హుల పేర్లపై గందరగోళం

జాబితాలో పేర్ల గల్లంతుపై గ్రామసభల్లో ఆవేదన..

ఆత్మీయ భరోసా సాయం అందించాలని కూలీల మొర

టేక్మాల్ జనవరి 23 ప్రభాతవార్త : నాలుగు సంక్షేమ పథకాల అమలు కోసం లబ్దిదారుల ఎంపికలో నిర్వహిస్తున్న గ్రామసభల్లో సమస్యలపై ప్రజలు నిలదీస్తూనే ఉన్నారు. గురువారం మండల పరిధిలోని వెల్పుగొండ, టేక్మాల్, ఎల్లంపల్లి, బొడ్మట్‌పల్లి, కుసంగి, సంగ్యాతండలల్లోనజరిగిన గ్రామ సభలు నిర్వహించారు. ఈ నెల 26న గణతంత్ర వేడుకల సందర్భంగా ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల లబ్దిదారుల జాబితాల్లో అర్హులైన వారి పేర్లు చదివి వినిపిస్తున్నారు. గ్రామసభల్లో అర్హత ఉండి జాబితాలో పేర్లు గల్లంతైన బాధితులు అధికారులకు ప్రొఫార్మాలో మరోసారి దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా అందించారు. అయితే అర్హుల జాబితాను గ్రామసభల్లో చదివి వినిపిస్తుండగా ఈనాలుగు సంక్షేమ ఫలాలు ఈసారైన గ్యారంటీగా అందుతాయా అంటూ నిలదీస్తున్నారు. పలు చోట్ల పేదలను విస్మరించి అర్హత లేని వారికి ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు జారీ చేయడంపై అభ్యంతరాలు నిరసనలు వ్యక్త మవుతున్నాయి. ప్రజాపాలనలో ఏడాది కాలంగా దరఖాస్తు చేసుకుంటూనే ఉన్న తమ పేర్లు లేకపోవడంపై బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. తొలి విడుతగా ఖాళీస్థలం ఉన్నవారికి రూ. ఐదులక్షలు వెచ్చించి గ్రామసభల్లో మంజూరు చేస్తున్న విషయం తెలిసిందే. పథకాలు గ్యారంటీ ఇస్తారా అంటూ అధికారులను నిలదీస్తున్నారు. ఇందిరమ్మ గృహాల జాబితాలో కొందరికే పథకాన్ని వర్తింప చేయడంపై ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ఈ పథకం వర్తించని పేదలు అధికారులను నిలదీసి ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో సర్వే చేసినప్పుడు, ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకుంటే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పి తమను ఎందుకు తిప్పించుకుంటున్నారని పలువురు మహిళలు నిలదీశారు. ప్రజాపాలన దరఖాస్తులను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించడంతో అధికారులు సమాధానం చెప్పలేక బిత్తరపోయారు. టేక్మాల్ గ్రామ సభ అరుపులు కేకల మధ్య రసాభసాగా ముగిసింది. మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సూచించడం తో ఇప్పటికైన ఇందిరమ్మ ఇళ్ల జాబితాపై గ్రామస్తుల నిరసన అధికారులు ప్రజలను మభ్యపెట్టేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నారని అధికారపార్టీ నేతలకే, కార్యకర్తలకే జాబితాలో చోటు కల్పిస్తున్నారని నిరసన వ్యక్తం చేశారు. గ్రామసభల నిర్వహణ ప్రశాంతంగానే సాగుతున్న అక్కడక్కడ పోలీసుల పహార మధ్య నిరసనలతో, నిలదీతలు గ్రామ సభలో అధికారులకు తప్పలేదు. ఇందులో ఎండిపిఓ విఠల్, తహశీల్దార్ తులసిరాం, ప్రత్యేకాధికారులు రియాజోద్దిన్,కిశోర్, గోపాల్, రఘునాథ్‌రావు, గ్రామ పంచాయితీ కార్యదర్శి రాకేష్, మౌనిక,రఘువేందర్, శ్రీనివాస్, సత్యనారాయణలతో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల నాయకులు కార్యకర్తలతో పాటు తదితరులున్నారు.

గ్రామసభల్లో పాల్గొన్న జెడ్పి సీఈవో

హత్నూర జనవరి 23, ప్రభాతవార్త : మండలంలోని హత్నూరరెడ్డి ఖానాపూర్ నస్తీపూర్‌గుండ్ల మాచునూరునవపేట్, సికిందలాపూర్, వడ్డేపల్లి, ఎల్లమ్మగూడా, దేవునిగుట్టతండా గ్రామపంచాయతీలలో బుధవారం గ్రామ సభలు నిర్వహించారు. నస్తీపూర్‌లో జరిగిన గ్రామసభలో జడ్పీ సీఇ వోజానకి రెడ్డి ఎంపీడీవో శంకర్ లు పాల్గొన్నారు. రెడ్డిఖానాపూర్ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో సంగారెడ్డి ఆర్డీవో రవీందర్ రెడ్డి, తాసిల్దార్ పర్వీన్ షేక్, గుండ్ల మాచ్నూర్ గ్రామంలో జరిగిన గ్

గ్రామసభలో మాట్లాడుతున్న తహశీల్దార్ లక్ష్మణ్ బాబు

ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

మెదక్ రూరల్, జనవరి 23 ప్రభాతవార్త: ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు అన్నారు. గురువారం మెదక్ మండలం మక్త భూపతిపూర్ గ్రామంలో ప్రజా పాలన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయభరోసా పథకాల లబ్ధిదారుల వివరాలను పంచాయతీ కార్యదర్శి నారాయణ చదివి వినిపించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌బాబు మాట్లాడుతూ సంక్షేమ పథకాలపై ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని అన్నారు. జాబితాలో పేర్లు రాని అర్హులు ఎవరైనా ఉంటే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి నారాయణ, టీఏ గౌతమి, క్షేత్ర సహాయకులు రవి, గ్రామ పెద్దలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం : ఎంపిడివో

మాట్లాడుతున్న ఎంపీడీవో కృష్ణవేణి

కొల్చారం, జనవరి 23 ప్రభాతవార్త: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని ఎంపీడీవో కృష్ణవేణి అన్నారు. గురువారం మండల పరిధిలోని సంగాయిపేట గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు ప్రజా పాలన గ్రామసభను నిర్వహించారు. గ్రామసభలో సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారి పేర్లను అధికారులు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కృష్ణవేణి మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో నమోదైన ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, రైతుభరోసా లబ్ధిదారుల పేర్లను చదివి వినిపించామని, ఆన్‌లైన్‌లో నమోదు కాకుండా ఉన్న అర్హులైన వారు మిగిలిపోతే గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రభాకర్, రెవెన్యూ సిబ్బంది సాయిలు, గ్రామ కార్యదర్శి సదాశివుడు, వ్యవసాయ అధికారులు, మాజీ వైస్ ఎంపీపీ అల్లు మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంజీవరెడ్డి, దర్జీ రాజు, ఆగం గౌడ్, గుట్టమీద వెంకటరెడ్డి, నరేందర్ రెడ్డి, బద్య నాయక్, పట్లోళ్ల నర్సారెడ్డి, అంగన్వాడి టీచర్లు, గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం : మాజీ ఎమ్మెల్యే



రేషన్‌కార్డుకు దరఖాస్తును నర్సారెడ్డికి అందజేస్తున్న మహిళ

గజ్వేల్, జనవరి 23 (ప్రభాతవార్త): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదల సంక్షేమానికి కృషి చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి పేర్కొన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో ఇందిరమ్మ కమిటీ సభ్యులు జంగం రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తూంకుంట నర్సారెడ్డి మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారన్నారు. ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డు, రైతుభరోసాను అందిస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. కొంతమంది బిఆర్ఎస్ నాయకులు ఉనికిని కాపాడుకోవడం కోసం కాంగ్రెస్ పార్టీపై దుష్ప్రచారం చేస్తూ తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, ఏఎంసి వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, గాడిపల్లి శ్రీనివాస్, మతీన్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు రమేష్, యూనుస్, జకీర్, గుండు లక్ష్మణ్, గుంటుకు శ్రీను, శ్రావణ్‌కుమార్, అజ్గర్, బలరాంగౌడ్ పాల్గొన్నారు.

అర్హులైన వారికి సంక్షేమ పథకాలు : ఆర్డీవో

మాట్లాడుతున్న ఆర్డీవో రమాదేవి

చిన్నశంకరంపేట, జనవరి 22,ప్రభాతవార్త: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందుతాయని మెదక్ ఆర్డీవో రమాదేవి అన్నారు. గురువారం మండల పరిధి ఎస్.కొండాపూర్‌లో జరిగిన గ్రామసభలో ఆమె పాల్గొన్నారు. సర్వే వివరాల జాబితాను అధికారులు గ్రామస్తులకు చదివి వినిపించారు. అర్హులైనవారు జాబితాలో పేర్లు లేకపోతే తిరిగి దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మన్నన్, ఉప తహసీల్దార్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి యోగేష్ పాల్గొన్నారు.

చిన్ననాటి మిత్రుడిని పలకరించిన మైనంపల్లి

చిన్నశంకరంపేట, జనవరి 22,ప్రభాతవార్త: మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మైనంపల్లి హనుమంతరావు తన స్వగ్రామమైన మండల పరిధి కొర్విపల్లికి రాగా తన చిన్ననాటి మిత్రుడు భూమయ్య కనిపించగా అతని వద్దకు వెళ్లి దగ్గరకు తిసుకొని అప్యాయంగా పలుకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నాడు. చిన్నతనంలో కలిసిమెలిసి ఉండేవారమని మైనంపల్లి హనుమంతరావు తెలిపారు.

ప్రభుత్వ పథకాలు అన్నీ బూటకమే

సిద్దిపేట అర్బన్,జనవరి 23, ప్రభాతవార్త : కాంగ్రెస్ ప్రభుత్వం అందించే పథకాలన్నీ బూటకంగా మారాయని పిఎసిఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్, అత్మకమిటీ మాజీ డైరెక్టర్ కనకమల్లయ్య అన్నారు. గురువారం వారు మాట్లాడతు, కాంగ్రెస్ సర్కారు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. కొత్త కొత్త పథకాలను తీసుకొచ్చి అనర్హులను లిస్టుల్లోచేర్చి ప్రజల మధ్య తగాదాలను సృష్టిస్తుందన్నారు. ఏ ప్రాతిపాదికన అర్హులను ఎంపిక చేస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. అర్హులకు పథకాలు అందించకుండా అనర్హులకు అందిస్తున్నారని తెలిపారు. అధికారులు ప్రభుత్వపథకాలపై పూర్తి వివరణ ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ సర్కారు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు.

మాట్లాడుతున్న చింతల శ్రీనివాస్

పోలీసు పహారాలో గ్రామ సభలు

బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, జనవరి 23(ప్రభాతవార్త): కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు పునాదులపై ఏర్పడిందని బిఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. గురువారం గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన బోగస్ సభలుగా ప్రతి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులను నిలదీస్తూ సభలను అడ్డుకుంటున్నారని అన్నారు. గ్రామసభలు పోలీస్ పహారా మధ్య తూతూ మంత్రంగా నడుస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను, 13 హామీలను ప్రజాపాలనలో పెట్టుకున్న దరఖాస్తులపై అధికారులను నిలబెట్టి నిలదీస్తూ గ్రామ సభలను బహిష్కరిస్తున్నారని ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గ్రామ సభలలో ప్రశ్నిస్తున్న వారిని ప్రశ్నించకుండా పోలీసులు అడ్డుకుంటున్నారని, అడ్డుకున్న వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. రైతులు రుణమాఫీపై ప్రశ్నిస్తుంటే ఇది రుణమాఫీ సభ కాదని అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం ఏర్పడ్డాక ఖర్చులతో ప్రజాపాలనలో రేషన్‌కార్డుల కోసం, పెన్షన్ల కోసం, ఇందిరమ్మ ఇండ్లకోసం, కౌలు రైతుల కోసం తీసుకున్న అప్లికేషన్లు ఎక్కడికి వెళ్లాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కోసం పెట్టిన సభలే గ్రామసభలు అన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ ఓట్లను దండుకోవడానికి కాంగ్రెస్ నాయకులు బ్లాక్‌మెయిల్, చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఎద్దేవ చేశారు. గతంలో కెసిఆర్ ప్రభుత్వం పది సంవత్సరాల పాలనలో బిజెపి కమ్యూనిస్టులాంటి పార్టీలను చూడకుండా అందరికి సంక్షేమ పథకాలు అందించినట్లు తెలిపారు. ఇప్పటికైనా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించాలని, లేనిపక్షంలో అర్హులైన వారితో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, యువజన విభాగం అధ్యక్షుడు స్వామిచారి, మండల పార్టీ అధ్యక్షుడు బెండె మధు, మాజీ జెడ్‌పిటిసి పంగ మల్లేశం, రాణి సత్యనారాయణగౌడ్, కౌన్సిలర్లు ఉప్పల మెట్టయ్య, మర్కంటి వరలక్ష్మి కనకయ్య, బబ్బూరి రజితగౌడ్, శీర్ల శ్యామల మల్లేశం, అత్తెల్లి శ్రీనివాస్, బొగ్గుల చందు, కిషన్‌రెడ్డి, జాఫర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తపల్లి గ్రామ సభలో మాట్లాడుతున్న బాబునాయక్

జాబితాలో మా పేర్లేవీ.. అధికారులను నిలదీత

రాయపోల్, జనవరి 23 ప్రభాతవార్త : ప్రభుత్వ పథకాల కోసం నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామసభల్లో జాబితాలో తమ పేర్లు ఎందుకు రాలేదు అధికారులను నిలదీశారు. బుధవారం రాయపోల్ మండలంలోని చిన్న మాసన్‌పల్లి, టెంకంపేట గ్రామాలలో ఉదయం, కొత్తపల్లి, రాంసాగర్ గ్రామాలలో మధ్యాహ్నం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామ సభల్లో ప్రజల నిరసనలు, ఆందోళనలు, నీలదీతల మధ్య కొనసాగింది. అధికారులు అర్హుల జాబితాలు చదువుతుండగా పక్కనే ఉన్నవారు ఏదో ఒక కారణం చూపి సభను ఆపుతున్నారు. ఎవరు అర్హులో, ఎవరు అనర్హులో అధికారులు నిర్ణయించలేకపోతున్నారు. గ్రామస్తులు పలుమార్లు దరఖాస్తు చేసుకున్న తమ పేర్లు లేవంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.మరొకొందరు పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నారు. జాబితాలో ఉన్న పేర్లు పైనల్ కాదని పూర్తి విచారణ చేసిన తర్వాతనే పథకాలు మంజూరు చేస్తామని,ఇది నిరంతరం కొనసాగే ప్రక్రియ అని అధికారులు వివరించినా పేర్లు రాని వారు శాంతించడం లేదు.ఇందిరమ్మ భరోసా కింద తండ్రి పేరు మీద భూమి ఉన్నా కొడుకుకు ఎలా వర్తిస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు.జాబ్‌కార్డు ఉండి భూమిలేని అసలైనఅర్హులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కేటాయించాలన్నారు.ప్రభుత్వం వెంటనే ఉపాధి హామీలో 20 రోజుల పనిచేసినవారికి అనే నిబంధన తొలగించి జాబ్‌కార్డు ఉన్న భూమి లేని ప్రతికూలికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫిసర్ బాబునాయక్,ఎంపీడీవో బాలయ్య,ఎంపీఓ శ్రీనివాస్, ఆర్ఐ బానుప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి ఆపార్ ఐడి తప్పనిసరి : ఎంఇవో

మునిపల్లి, జనవరి 23, ప్రభాతవార్త: ప్రతి విద్యార్థికి ఆపార్ (ఆటోమెటెడ్ పర్మనెంట్ ఆకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఐడి తప్పనిసరని మండల విద్యాధికారి భీమ్‌సింగ్ పేర్కొన్నారు. మునిపల్లిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన ఆపార్ మీగింగ్‌కు ఎంఈఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఆపార్‌కార్డుద్వారా విద్యార్థుల డేటా నిర్వహణలో పారదర్శకతను పెంచడమే కాకుండా విద్యా డేటాను ఒకే చోట నిల్వ చేస్తుందన్నారు. ప్రతి విద్యార్థికి ప్రత్యేక గుర్తింపు ఐడి ఉండేలా ఆయా పాఠశాలలు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌సి సిబ్బంది, సిఆర్‌పిలు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ప్రారంభం

గజ్వేల్ టౌన్, జనవరి 23 (ప్రభాతవార్త): గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం జిల్లా స్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళిలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ డి.రవీంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ స్పోర్ట్స్ మీట్‌లో 15 కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి రోజు అన్ని క్రీడలు ప్రారంభం కాగా రెండవ రోజు శుక్రవారం ముగుస్తాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్.వెంకటకృష్ణారావు తెలిపారు. క్రీడలు ముగిసిన తర్వాత సాయంత్రం ముగింపు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం గజ్వేల్ ఏఎంసి చైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, కాంగ్రెస్ నాయకులు ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, అజహర్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో క్రీడలను ప్రారంభిస్తున్న దృశ్యం



విద్యార్థులకు సెల్యూట్ చేస్తున్న అనూఫ్‌కుమార్‌యమ

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం

-అంతర్జాతీయ రోలర్ స్కెట్టింగ్ క్రీడాకారుడు అనూఫ్‌కుమార్‌యమ

గజ్వేల్, జనవరి 23 (ప్రభాతవార్త): క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని అర్జున అవార్డుగ్రహీత, అంతర్జాతీయ రోలర్ స్కెట్టింగ్ క్రీడాకారుడు అనూఫ్‌కుమార్‌యమ పేర్కొన్నారు. గురువారం గజ్వేల్ పట్టణంలోని సాయి జిడిఆర్ పాఠశాలలో అంతర్గత క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటుచేసిన క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తోకల సుదామ్ష్‌రెడ్డి, విజయలక్ష్మి, నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

వెల్దుర్తి, జనవరి 23 ప్రభాతవార్త: మండల పరిధిలోని మంగళపర్తి గ్రామంలో ఇటీవల మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు గురువారం మంగళపర్తి గ్రామానికి చేరుకొని మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ నాయకుడు నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు పనలను పరిశీలించిన కార్పొరేటర్

రామచంద్రాపురం, జనవరి 23, ప్రభాతవార్త: మియాపూర్ నుంచి సంగారెడ్డి వరకు నిర్వహిస్తున్న 6లైన్‌ల రోడ్డు పనుల్లో భాగంగా రామచంద్రాపురం డివిజన్ జాతీయ రహదారి 9లో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను నేషనల్ హైవే డీఈ రామకృష్ణ, ఏఈఈ శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులతో కలిసి కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ గురువారం పరిశీలించారు. మెయిన్ రోడ్డుగా 4 లైన్‌లతో గ్రిల్‌తో నిర్మిస్తున్నట్లు, అలాగే స్థానికులకు ఇరువైపులా 30 ఫీట్ల సర్వీస్ రోడ్డు, 6 ఫీట్ల ఫూట్‌పాతతో కూడిన రోడ్డును వేయిస్తామని అధికారులు కార్పొరేటర్‌కు తెలిపారు. రోడ్డు మధ్యలోకి వస్తున్న విగ్రహాల గురించి ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా ఎక్కడి విగ్రహాలు అక్కడే ఉండేట్లు చూడాలని కార్పొరేటర్ అధికారులను ఆదేశించారు.

బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన

పుల్‌కల్, జనవరి 23, ప్రభాతవార్త: మండల పరిధిలోని సింగూర్, పుల్‌కల్, మిన్పూర్ ప్రాథమిక ఉన్నత ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం మండల లీగల్ సర్వీసెస్ జోగిపేట ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు లింగమయ్య, వెంకటకృష్ణలు మాట్లాడుతూ చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన పొంది ఉండాల్సిన అసవరసం ఉందన్నారు. ప్రతి ఒక్కరు విద్యను అందుకోవాలన్నారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, విద్యార్థులు పీఎల్‌వీలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

చిన్నశంకరంపేట, జనవరి 22,ప్రభాతవార్త: మండల పరిధి ఖాజాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ,మాజీ సర్పంచి పాండరి గౌడ్ కుటుంబాన్ని మెదక్,మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు గురువారం పరామర్శించారు. పాండరిగౌడ్ సతీమణి భారతిబాయ్ అనారోగ్యంతో మృతి చెందగా విషయంతెలుసుకున్న మైనంపల్లి హనుమంతరావు పరామర్శించారు. అలాగే పార్టీ కార్యకర్త పవన్ రోడ్డుప్రమాదంలో గాయపడగా వారి కుటుంబాన్ని,ఇటీవల బెంగళూరులో గుండెపోటుతో మృతి చెందిన యాదగిరి కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. రామాయంపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగా నరేందర్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సాన సత్యనారాయణ, నాయకులు మనోజ్, తీగుళ్ల బిక్షపతి తదితరులున్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ

చిన్నశంకరంపేట,జనవరి 22,ప్రభాతవార్త:

చిన్నశంకరంపేట మండల మాజీ ఎంపీపీ, ఖాజాపూర్ మాజీ సర్పంచి పాండరి గౌడ్ సతీమని భారతి బాయి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందగా ఈ విషయం తెలుసుకున్న మెదక్ ఎమ్మెల్సి శేరి సుభాష్‌రెడ్డి వారి కుటుంబాన్ని గురువారం నాడు పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ బాచుపల్లి యాదగిరి, మాజీ సర్పంచి యాదగిరి,సుధాకర్, నాయకులు తీగుళ్ల స్వామి, కుంట నరేష్ తదితరులున్నారు.

నేతాజీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళులు

గుమ్మడిదల, జనవరి 23 ప్రభాతవార్త: గుమ్మడిదల మండలలో యువజన వారోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని మండల యువజన సంఘాల సమితి ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొనసాగిద్దాం.. కొనసాగిద్దాం నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాలను కొనసాగిద్దాం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యువజన సంఘాల ప్రతినిధి మంద భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ నేటి యువత సుభాష్ చంద్రబోస్ అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, మాజీ సర్పంచ్ చిమ్ముల నరసింహారెడ్డి, యువజన సంఘాల సభ్యులు చెన్నంశెట్టి ఉదయ్ కుమార్, వీఎ. ఎల్లయ్య, చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, వర్తక సంఘం అధ్యక్షులు ఆకుల సత్యనారాయణ, ప్రవీణ్ రెడ్డి, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, రవి కాంత్ రెడ్డి, సంజీవ రెడ్డి, సూర్యనారాయణ, నల్తూరు యాదగిరి, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో...

నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బిజెపి నేతలు

గజ్వేల్, జనవరి 23 (ప్రభాతవార్త): మహా నేత సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని బిజెపి పట్టణ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్ యాదవ్, మండల అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఎల్లు రాంరెడ్డి, కుడిక్యాల రాములు, ఉప్పల మధుసూదన్, నత్తి శివకుమార్, చెప్యాల వెంకట్‌రెడ్డి, దుబ్బకుంట నరేష్, సుమతి, పెండ్యాల శ్రీనివాస్, నాయిని సందీప్, కుంకుమ రాణి, మంతురి మమత, బార్ అరవింద్, శ్రీనివాస్, గణపతి, వేణు, శివప్రసాద్, చందు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయాలి

మాట్లాడుతున్న బిజెపి మండల అధ్యక్షుడు ఈర్ల రాజు

అమీన్‌పూర్, జనవరి 23 ప్రభాతవార్త: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేయాలని బీజేపీ అమీన్‌పూర్ మండల అధ్యక్షులు ఈర్ల రాజు అధికారులను కోరారు. గురువారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పటేల్ గూడలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో ఈర్ల రాజు పాల్గొని ప్రజా సమస్యలపై, ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేయకపోవడంపై ఆయన స్పందించారు. అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఆసరా పింఛన్లు, రైతుభరోసా, ఆత్మీయభరోసా, ఆరుగ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదికాలంగా పట్టించుకున్న పాపానపోలేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం అర్హులైనవారికి ఆరు గ్యారంటీలను, సంక్షేమ పథకాలను పేద కుటుంబాలకు అందజేయాలని కోరారు. ఇదివరకే చాలాసార్లు రేషన్‌కార్డులు, ఆసరాపింఛన్‌లు, ఇల్లులేని పేదలకు ఇళ్లకు ఎన్నో దరఖాస్తులు పెట్టుకున్నారని, మళ్లీ ఇప్పుడు వార్డుసభలు పెట్టి మళ్లీ దరఖాస్తులు స్వీకరించడమంటే పేద ప్రజలను స్థానిక సంస్థల ఎన్నికల కోసం మోసం చేస్తుందని ఈర్ల రాజు చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ సెక్రటరీ జయ బాలరాజ్, బీజేపీ బూత్ అధ్యక్షులు చిన్నారుల శ్రీనివాస్, నాయకులు ఈర్ల భాస్కర్, గులకుంట యాదగిరి పాల్గొన్నారు.

అభివృద్ధిలో అగ్రగామిగా అమీన్‌పూర్ మున్సిపాలిటీ

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

అభివృద్ధిపనులకు శంకుస్థాపనచేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

అమీన్‌పూర్, జనవరి 23ప్రభాతవార్త: అమీన్‌పూర్ మున్సిపాలిటీని అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దుతున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులలో 6 కోట్ల 82 లక్షలరూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు పనులకు మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నందారం నరసింహాగౌడ్‌తోకలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.అనంతరం లాలాబావికాలనీలో నూతనంగా నిర్మించిన రిజర్వాయర్ నుండి మంచినీటి సరఫరాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో దశాబ్ద కాలంగా అపరిష్కృతంగా ఉన్న రక్షిత మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడం జరిగిందన్నారు. ఐదు భారీ రిజర్వాయర్‌లు నిర్మించి ప్రతి ఇంటికి మంచినీటి కనెక్షన్లు అందిస్తున్నామని తెలిపారు. ప్రతి కాలనీలో సీసీ రోడ్లు, వీధి దీపాలు, పార్కుల నిర్మించి అభివృద్ధిలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వాసుదేవ్‌ను సన్మానించిన పద్మశాలి సంఘం నాయకులు

గజ్వేల్, జనవరి 23 (ప్రభాతవార్త): పద్మశాలి ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా గజ్వేల్ పట్టణానికి చెందిన దేవసాని వాసుదేవ్ ఎన్నిక కావడంతో గురువారం పద్మశాలి సంఘం భవనంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చ

విద్యార్థులు జ్ఞాపక శక్తిని మెరుగుపరుచుకోవాలి

జేడీ లక్ష్మినారాయణ

నర్సాపూర్, జనవరి 23, ప్రభాతవార్త : విద్యార్థులు చదువులో పట్టు సాధించేందుకు జ్ఞాపకశక్తిని మెరుగుపరుచుకోవాలని మాజీ ఐపీఎస్ అధికారి జెడి లక్ష్మినారాయణ అన్నారు. నర్సాపూర్‌లోని సాయికృష్ణ గార్డెన్‌లో పదవ తరగతి విద్యార్థుల ప్రేరణ కోసం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం నిర్వహించిన ప్రేరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు కళ్లతో,మనసుతో, హృదయంతో ఆసక్తిగా చదువుకోవాలన్నాడు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల జ్ఞాపకశక్తి మెరుగుపడే రెండు చిట్కాలు ఉదహరించాడు. అందులో ఒకటి 21 గుండీలు తీయాలని , రెండవది మెదడును ఉత్తేజితం చేయటానికి 1 నుండి 100 వరకు లెక్కించాలన్నారు. ఈ విధంగా లెక్కిస్తే ఎడమ మెదడు భాగం ఉత్తేజమవుతుందని, అదేవిధంగా 100 నుండి 1 వరకు లెక్కిస్తె కుడి మెదడు ఉత్తేజితం అవుతుందని తెలిపారు.అందులో కుడి మెదడు ఉత్తేజితం అయినచో వారు గొప్ప మేధావులు అవుతారని తెలిపారు. ఇదిలా ఉండగా ఈ సమావేశంలో వాతావరణ కాలుష్యానికి సంబంధించిన ప్లాస్టిక్ వ్యర్థాలను తాగునీటి బాటిల్లో వేసి చెత్తబుట్టలో వేయమని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేపించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ తనకు ప్రేరణగా తన తల్లిదండ్రులు ,తన గురువులే కారణమని బదులిచ్చారు.మీకు కనబడిన తల్లిదండ్రులకు గురువులకు నమస్కరించమని ఆయన సూచించారు. కార్య క్రమంలో మండల విద్యాధికారి తారా సింగ్, ప్రైవేట్ పాఠశాలల ప్రతినిధులు నరసింహారెడ్డి, వెంకటేశ్వర్లు,దీపక్‌దాస్, నర్సిరెడ్డి, నర్సాపూర్ ప్రభుత్వ పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు, సౌమ్య నాయక్, వీరేశం ఉపాధ్యాయులు, ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు తదితరులు పాల్గొన్నారు.

మోడీ ప్రభుత్వంతోనే దేశాభివృద్ధి

బిజెపి ఒబిసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాప గారి రమేష్‌గౌడ్

నర్సాపూర్, జనవరి 23, ప్రభాతవార్త : ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వంతోనే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని బిజెపి ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాపగారి రమేష్‌గౌడ్ అన్నారు. గురువారం సంవిధాన్ గౌరవ కార్యక్రమంలో భాగంగా నర్సాపూర్‌లోని అంబేద్కర్ కాలనీలో బిజెపి బృందం పర్యటన చేసి డాక్టర్ బిఆర్ అంబెద్కర్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాపగారి చిన్న రమేష్ గౌడ్ మాట్లాడుతూ దేశ ప్రగతి కోసం కోట్లాది ప్రజల అభివృద్ధి కోసం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో రాశాడని అన్నారు. ప్రస్తుతం అదేవిధంగా కేంద్రంలో మోడీ ప్రభుత్వం డాక్టర్ అంబేద్కర్ సూత్రాలు పాటిస్తూ దేశంలోని అన్ని వర్గాల అభివృద్ధి కోసం కృషి చేస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో బిజెపి నర్సాపూర్ కన్వీనర్ హెచ్ వి రమణారావు, కౌన్సిలర్లు బుక్ చేసి యాదవ్, గోడ రాజేందర్, బిజెపి నాయకులు బోర్ వెల్ రాంరెడ్డి, బాదే బాల్ రాజ్, గుండం శంకర్, ఆంజనేయులు గౌడ్, నీరుడు చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లా సర్వే, ల్యాండ్ రికార్డ్ ఫోరం ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

సంగారెడ్డి మున్సిపాలిటీ, జనవరి 23, ప్రభాతవార్త : సంగారెడ్డి జిల్లా సర్వే, ల్యాండ్ రికార్డ్స్ ఫోరం ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంగారెడ్డిలోని టీఎన్జీవో భవన్లో జరిగిన కార్యక్రమంలో ఎన్నికలు నిర్వహించారు జిల్లా అధ్యక్షులుగా ఎం.రాజు, కార్యదర్శిగా జి.రాము, కోశాధికారిగా వి.వెంకటేశం మరియు 16 మందితో కూడిన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ముఖ్యఅతిథులుగా సంగారెడ్డి జిల్లా జే.ఏ.సీ చైర్మన్, టిఎన్జీవో జిల్లా అధ్యక్షులు ఎం.డీ.జావీద్ అలీ, కార్యదర్శి వి.రవి పాల్గొన్నారు. ఎలక్షన్ అబ్జర్వర్ గా టీఎన్జీవోస్ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కసిని శ్రీకాంత్, ఎలక్షన్ ఆఫీసర్‌గాఎం.డీ.అజీమ్‌లు వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు. వి.విజయ కుమార్, పంచాయితీకార్యదర్శులకు ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్. బలరాం, సర్వేయర్ల మాజీ అధ్యక్షులు ఎన్. ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులు పెడితే ఊరుకునేది లేదు

మైనంపల్లి హనుమంతరావు

చిన్నశంకరంపేట, జనవరి 22,ప్రభాతవార్త: రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఊరుకునేది లేదని మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. గురువారం మండల పరిధి ఖాజాపూర్ గ్రామంలో పర్యటించిన హనుమంతరావును రైతులు కలిశారు. మడూర్ సహకార సంఘం చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని రైతులు హనుంతరావు దృష్టికి తిసుకెళ్లారు. స్పందించిన ఆయన జిల్లా అదనపు పాలనాధికారి నగేష్‌కు ఫోన్ చేసి విచారణ చేసి శ్రీనివాస్ రెడ్డి తప్పు చేస్తే చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : ఎస్ఐ

ములుగు, జనవరి 23 (ప్రభాతవార్త): వాహనదారులు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా గురువారం మండల పరిధిలోని మామిడ్యాల గ్రామంలో ఆటో డ్రైవర్లకు, యువకులకు, గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని, ద్విచక్ర వాహనాలు హెల్మెట్, కారు నడిపే వారు సీటు బెల్ట్ తప్పకుండా పెట్టుకోవాలన్నారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడుపవద్దన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, ట్రిబుల్ రైడింగ్ అస్సలు చేయవద్దని సూచించారు. నిబంధనలు పాటించి వాహనాలు నడిపినట్లయితే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన శాసనమండలి మాజీ ప్రొటెం స్పీకర్ భూపాల్‌రెడ్డి

రామచంద్రాపురం, జనవరి 23, ప్రభాతవార్త: రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీవి.గీతభూపాల్‌రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను (ఫ్లోరింగ్ పనులు) తెలంగాణ శాసన మండలి మాజీ ప్రొటెం స్పీకర్ వెన్నవరం భూపాల్‌రెడ్డి గురువారం పరిశీలించారు. కళాశాలలో జనవరి 26న నిర్వహించే గణతంత్ర దినోత్సవం, వార్షికోత్సవం వేడుకలను పురస్కరించుకుని కళాశాలలో నిర్మిస్తున్న ఫ్లోరింగ్ పనులను కళాశాల ప్రిన్సిపల్ వెంకట్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. అవసరమైన చోట ప్లంబర్, పైప్‌లైన్ మరమ్మత్తు పనులు, ఎలక్ట్రికల్ పనులను తన స్వంత ఖర్చులతో నిర్వహిస్తానని భూపాల్‌రెడ్డి ప్రిన్సిపల్ వెంకట్‌రెడ్డికి సూచించారు. కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పోరేటర్ తొంట అంజయ్య, బిఆర్ఎస్ నాయకులు కుమార్ గౌడ్, జగన్నాథ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఛలో సిద్దిపేటను విజయవంతం చేయండి

గజ్వేల్ టౌన్, జనవరి 23 (ప్రభాతవార్త): ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఫిబ్రవరి 7న హైద్రాబాద్‌లో నిర్వహించబోయే వేల గొంతులు లక్ష డప్పుల మండే మాదిగల గుండెచప్పుడు కార్యక్రమానికి మద్దతుగా ఈనెల 25న సిద్దిపేట జిల్లా కేంద్రంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం నుండి బిజెఆర్ విగ్రహం వరకు వేలాది మందితో వేలాది డప్పులతో వేల గొంతులు లక్ష డప్పుల సిద్దిపేట, మెదక్‌జిల్లాల సన్నాహక మహా ప్రదర్శన జరగబోతుందని దళిత సంఘాల నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ పాల్గొననున్నారు. కావున ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని గ్రామాల నుండి మాదిగ,ఉపకులాలు అలాగే ఎస్సీ వర్గీకరణ సమర్థించే ఎస్సీ,ఎస్టీ,బిసి, ఓసి అన్ని వర్గాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలన్నారు. ప్రతి గ్రామం నుండి వచ్చే ప్రతి ఒక్కరు డప్పుజబ్బకు వేసుకొని రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ మాదిగ, ఎంఎస్‌పి రాష్ట్ర నాయకుడు మైస రాములు, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి ఉబ్బని ఆంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షుడు బొమ్మని మహేష్, గజ్వేల్ నియోజకవర్గ కన్వీనర్ శనిగరి రమేష్, నాయకులు బొంది స్వామి, పోసానిపల్లి రాజు, చిన్నరాజు, కిషన్, నవీన్, ప్రసాద్, సంపత్, రవి, మల్లేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎల్ఓసి చెక్కును అందించిన కొమ్మూరి

చేర్యాల,జనవరి 23,ప్రభాతవార్త : చేర్యాల మండలం ఆకునూరు గ్రామానికి చెందిన బోయిని బాలవ్వకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన రూ.4లక్షల ఎల్ఓసి చెక్కును గురువారం మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చేర్యాలలోని తన నివాసంలో బాధిత కుటుంభ సభ్యునికి అందజేశారు. నాయకులు కొమ్మురవి,పూర్మ ఆగంరెడ్డి, అందెనాని బాబు, ఆకుల రాజు, బోయిని నరేష్, తోల్ల రాజేశ్వరి, సుర సంపత్, బూమని బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్ గ్రామసభ రసాభాస

-అర్హులైన వారి పేర్లు లేవంటూ ఆందోళన

గ్రామసభలో అధికారులతో వాగ్వివాదానికి దిగుతున్న ప్రజలు

జగదేవ్‌పూర్, జనవరి 23 (ప్రభాతవార్త): జగదేవ్‌పూర్ మండలకేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల మంజూరు, ఇందిరమ్మ ఇండ్లు వంటి సంక్షేమ పథకాల అమలుపై గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో అర్హులైన వారి వివరాలను అధికారులు చదివి వినిపించడంతో అర్హులై పేర్లు రాని వారు మేము సంక్షేమ పథకాలకు అన్ని విధాలా అర్హులమని, మా పేర్లు ఎందుకు రాలేదంటూ గ్రామసభలో వాగ్వివాదానికి దిగగా గ్రామసభ రసాబసగా మారింది. పలువురు తమకు ఎలాంటి భూమి లేకున్నా ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో పేర్లు రాలేదని, పది సంవత్సరాలుగా రేషన్ కార్డు లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం, ఈ ప్రభుత్వమైనా రేషన్ కార్డులను మంజూరు చేస్తుందని ఎంతో ఆశపడ్డ మాకు నిరాశే ఎదురైందని, కాంగ్రెస్ ప్రభుత్వం మమ్మల్ని మోసం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తదనంతరం బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పనగట్ల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో రోడ్డుపై ఆందోళనకు దిగి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల కోసమే మోసపూరిత హామీలు చేస్తున్నారని, గ్రామ సభలలో ఇచ్చే హామీలు అన్నీ బూటకమే అని ఎద్దేవ చేశారు. ఎన్నికలలో భాగంగా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయక ప్రజలను మోసం చేసిందని, రేవంత్ సర్కార్ డిసెంబరు 9న రూ.2 లక్షల రుణమాఫీ చేసి వెంటనే బ్యాంకుల ద్వారా రుణం అందిస్తామని చెప్పినా ఇప్పటి వరకు ఎంతో మందికి రుణమాఫీ అందలేదని అన్నారు.

కళ్యాణలక్ష్మి, తులం బంగారం ఏది

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో గెలిస్తే కళ్యాణలక్ష్మి కింద లక్ష 116తో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పగా ఇప్పటి వరకు దాని ఊసే లేదని జగదేవ్‌పూర్ మాజీ ఎంపిటిసి కవిత శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎంతో మంది ఆడపడుచుల తల్లిదండ్రులు కళ్యాణలక్ష్మి పథకం కింద ఆర్థిక సహాయంతో పాటు తులం బంగారం అందుతుందని ఆశతో ఎదిరిచూసి నిరాశకు గురయ్యారని, తెలంగాణ ఆడపడుచులను మోసం చేసిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని మండిపడ్డారు. గ్రామ సభలలో తూ తూ మంత్రంగా లబ్ధిదారుల పేర్లను చదివి వినిపించడమే కానీ సంక్షేమ పథకాలకు సంబంధించిన ప్రొసిడింగ్‌లు ఇవ్వలేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రే నియోజకవర్గానికి 3500 ఇండ్లు ఇస్తామని చెబితే గ్రామాల్లో మాత్రం నామమాత్రంగా లబ్ధిదారులను ఎంపిక చేయడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ బూటకాలే అని, కేవలం స్థానిక సంస్థల ఎన్నికల కోసమే ఇదంతా చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఓ లత, ఎంపిడిఓ బి.యాదగిరి, పంచాయతీ కార్యదర్శి రాంరెడ్డి, బిఆర్ఎస్ నాయకులు బుద్ధ నాగరాజు, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఎక్బాల్, కొత్త శ్రీనివాస్‌రెడ్డి, మహేష్, శ్రీను, దాచారం కనకయ్య, మచ్చ గణేష్, మునిగడప మాజీ ఎంపిటిసి కారింగుల కిరణ్‌గౌడ్, బాల్‌నర్సయ్య, కాంగ్రెస్ నాయకులు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రాజగోపాల్‌పేటలో సెంట్రల్ లైటింగ్

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి లేఖ రాసిన హరీష్‌రావు

సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి: సిద్ధిపేట నియోజకవర్గ పరిధిలో నిర్మిస్తున్న సిద్ధిపేట-ఎల్కతుర్తి జాతీయ రహదారిలో భాగంగా నంగునూర్ మండలం రాజగోపాల్‌పేట గ్రామం వద్ద సెంట్రల్ లైటింగ్, పుట్‌పాత్‌తో కూడిన డ్రైనేజీ ఏర్పాటుచేయాలని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయరహదారుల మంత్రి నితిన్ గడ్కరీకి మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు గురువారం లేఖ రాశారు. సిద్ధిపేట-ఎల్కతుర్తి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని సంతోషం వ్యక్తంచేస్తూ రాజగోపాల్‌పేట గ్రామపరిధిలో రోడ్డు వేగవంతంగా మారిందని రోడ్డుపక్కన అభివృద్ధి పెరగడం వలన వాహనాల రాకపోకలు పెరిగిన నేపథ్యంలో పాదచారుల పనులు, కార్యకలాపాలు సైతం పెరిగాయని ఇటీవల గ్రామప్రజలు తనదృష్టికి తెచ్చారని లేఖలో పేర్కొన్నారు. రాజగోపాల్‌పేట వద్ద సెంట్రల్ లైటింగ్, డ్రైనేజీ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామపరిధిలో 1కిలోమీటరు సెంట్రల్ లైటింగ్, డ్రైనేజీ ఏర్పాటుచేయాలని లేఖలో కోరారు.

ఘనంగా నేతాజీ జయంతి వేడుకలు

చేర్యాలలో నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బిజెపి శ్రేణులు

చేర్యాల, జనవరి 23, ప్రభాతవార్త: చేర్యాలపట్టణంలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకలను బిజెపి మండలాధ్యక్షులు వడ్లకొండ సంజీవులు, పట్టణాధ్యక్షులు మన్నె సత్యవర్ధన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం పట్టణంలోని హనుమాన్ దేవాలయంవద్ద ఉన్న నేతాజీ విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ యువత ఆమహనీయుని అడుగుజాడల్లో నడవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పోతుగంటి రామదాసు, నర్ర మహేందర్‌రెడ్డి, ఉమారెడ్డి, కాశెట్టి పాండు, ముచ్చేంతుల సిద్దారెడ్డి, సంజీవరెడ్డి, నిమ్మ లక్ష్మారెడ్డి, మడికొండ శ్రీనివాస్, బయ్యారపు యాదగిరి, సిద్దులు, లక్ష్మిపతి, జాలిగామ రమేష్, సత్యనారాయణ, మల్లేశం, భాను ప్రకాష్, మహేష్ పాల్గొన్నారు.

పంచతంత్ర పాఠశాలలో...

చేర్యాలపట్టణంలోని పంచతంత్ర పాఠశాలలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని హనుమాన్ దేవాలయంవద్ద ఉన్న నేతాజీ విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్యామల, ఉపాధ్యాయులు రమాదేవి, కీర్తన, మౌనిక, మధు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్‌లో...

జగదేవ్‌పూర్, జనవరి 23 (ప్రభాతవార్త): భారత స్వాతంత్ర్య సాధనే లక్ష్యంగా జీవించిన సుభాష్ చంద్రబోస్ భారతజాతి వేకువ కిరణమని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం మండలకేంద్రంలో సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య సాధనే తన జీవిత ధ్యేయంగా తపించిన భారతమాత ముద్దుబిడ్డ సుభాష్‌చంద్రబోస్ అని, ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి తెల్లవారి గుండెల్లో నిద్రించిన కణ కణ మండే నిప్పు కణిక సుభాష్‌చంద్రబోస్ అని కొనియాడారు. యువత వారిని ఆదర్శంగా తీసుకొని దేశ రక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఎక్బాల్, గ్రామ బిఆర్ఎస్ అధ్యక్షుడు బుద్ధ నాగరాజు, మాజీ ఎంపిటిసి కొత్త కవిత శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు దాచారం కనకయ్య, కొంపల్లి మహేష్, మచ్చ గణేష్, భగత్ యూత్ అధ్యక్షుడు రాగుల వంశీ, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకల్లో పాల్గొన్న నేతలు

సుభాష్‌చంద్రబోస్‌కు ఘన నివాళులు

మర్కుక్, జనవరి 23 (ప్రభాతవార్త): సుభాష్‌చంద్రబోస్ 128వ జయంతి సందర్భంగా మండల పరిధిలోని గణేష్‌పల్లి చౌరస్తాలో గల సుభాష్‌చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తాజా మాజీ జెడ్‌పిటిసి మంగమ్మ రాంచంద్రం, మాజీ వైస్ ఎంపిపి బాల్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి నరేందర్, మాజీ సర్పంచ్‌లు మంజుల శ్రీరాములు, లక్ష్మీరాములుగౌడ్, కప్పర భానుప్రకాష్‌రావులు మాట్లాడుతూ యువతకు సుభాష్‌చంద్రబోస్ ఆదర్శమని, భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామంలో ముఖ్య భూమిక పోషించిన సుభాష్‌చంద్రబోస్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, నేటి యువత సుభాష్‌చంద్రబోస్ జీవిత చరిత్రను చదువుకోవాలని, మరణం లేని నేతగా సుభాష్‌చంద్రబోస్ ప్రపంచ వ్యాప్తంగా పేరు తెచ్చుకున్న నేత అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మహేష్, నాయకులు రామరాజు, గోవర్ధన్, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటిద్దాం.. ప్రమాదాలను నివారిద్దాం

గజ్వేల్ టౌన్, జనవరి 23 (ప్రభాతవార్త): ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రమాదాలను నివారిద్దామని ఎంవిఐ క్రిస్టోఫర్ పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా గజ్వేల్ పట్టణంలో ప్రజలకు, వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గజ్వేల్ పట్టణంలోని బస్టాండ్ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించాలని అన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రిబుల్ రైడ్ చేయవద్దని, కారులో ప్రయాణించే వారు సీటుబెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడిపితే ప్రమాదాలను అరికట్టవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంవిఐ శ్రీకాంత్‌రెడ్డి, విక్టోరియా, కానిస్టేబుల్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి..మరొకరికి గాయలు

కొమురవెల్లి, జనవరి 23, ప్రభాతవార్త : కొమురవెల్లి మల్లన్న దర్శనార్థం వస్తుండగా మండంలోని ఐనాపూర్ నర్గామ శివారులో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరొక యువకుడు గాయాలపాలైన సంఘటన సంఘటన గురువారం జరిగింది. హైదారాబాద్ మల్కాజ్‌గిరికి చెందిన ఏగుర్ల సతీష్(36) స్విగ్గీ ఫుడ్ డెలివరీ కంపెనీలో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. క్రమంలో గురువారం ఉదయం తన మిత్రులతో కలిసి 8 మంది నాలుగు బైక్‌లపై మల్లన్న దర్శనం కోసం ఇంటి నుంచి బయలు దేరారు. మరి కొద్ది నిమిషాలలో కొమురవెల్లికి చేరుకోనున్న క్రమంలో రాజీవ్ రహదారికి సమీపంలో ఐనాపూర్ గ్రామ శివారు మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న డిసిఎంను ఢీ కొంది.దీంతో ద్విచక్రవాహనంపై వెనకాల కూర్చున్న సతీష్ అక్కడికక్కడే మృతి చెందగా వాహనం నడుపుతున్న వంశీకి తీవ్ర గాయాలకు గురయ్యారు. గాయాలకు గురైన వంశీని చికిత్సనిమిత్తం హైదారాబాద్‌కు రెఫర్ చేశారు. విషయం తెలిసిన చేర్యాల సిఐ ఎల్.శ్రీను, ఎస్ఐ రాజు సంఘటన స్థలాన్ని పరిశీలించి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు వరం సిఎంఆర్ఎఫ్

బెజ్జంకి, జనవరి 23, ప్రభాతవార్త : సిఎం సహాయనిధి పేదలకు వరం లాంటిదని మాజీ ఎంపిపి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్ అన్నారు. దాచారం గ్రామానికి చెందిన దీటి బాలవ్వ ఇటీవల అనారోగ్య కారణంతో చికిత్స పొందడడంతో సిఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా రూ.43 వేల సిఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరు కావడంతో గురువారం అందజేశారు. సిఎం సహాయ నిది చెక్కు మంజూరు చేసిన ప్రభుత్వానికి, నాయకులకు బాధిత కుటంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కెసిఆర్, తన్నీరు హరీష్‌రావుల కృషితోనే సాగునీరు

బిఆర్ఎస్ నాయకులు జంగిటి శ్రీనివాస్

కెసిఆర్, హరీష్‌రావుల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

చిన్నకోడూరు, జనవరి 23, ప్రభాతవార్త: తెలంగాణ ప్రత్యేకరాష్ట్రాన్ని సాధించి అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్‌ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టులు నిర్మించి రైతులకు, ప్రజలకు మేలుచేసిన ఘనత మాజీసిఎం కెసిఆర్, మాజీమంత్రి హరీష్‌రావులకే దక్కుతుందని బిఆర్ఎస్ నాయకులు జంగిటి శ్రీనివాస్ అన్నారు. గురువారం మెట్టుపల్లి, సలేంద్రి రైతులకు సాగునీరు అందిన సందర్భంగా సంతోషంగా రైతులు కెసిఆర్, హరీష్‌రావుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఆయన రైతులను కలిసి మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందని ఏదో అవినీతి జరిగిందని మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుల తీరుకు కాళేశ్వరం ద్వారా సాగునీరు అందించడం చెంపపెట్టులాంటిందన్నారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిననాటి నుంచి నేటివరకు రైతులను మోసం చేయడమే సిఎం రేవంత్‌రెడ్డి పనిగా పెట్టుకున్నారని తెలిపారు. బిఆర్ఎస్‌ప్రభుత్వ హయాంలో కెసిఆర్, హరీష్‌రావుల చొరవతో నిర్మించిన ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందడంతో రైతులు సంతోషంగా పంటలు పండించుకుంటున్నారని తెలిపారు. అధికారంలోకి రాగానే రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్‌సర్కారుకు సమయం వచ్చినప్పుడు ప్రజలే గుణపాఠంచెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, రైతులు కీసర పాపయ్య, కుంట వినయ్‌రెడ్డి, కొత్త శంకర్, దయ్యాల మొండయ్య, కుమార్, కొత్త రామచంద్రం, బాలమల్లుగౌడ్, ఎడమేన రాజయ్య, కొత్త ఎల్లయ్య, చంద్రం, ఉపికే శ్రీనివాస్‌రెడ్డి, రాజు, కిట్టు, వినీత్, కృతిక్, సంజీవ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

-మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య

గజ్వేల్ టౌన్, జనవరి 23(ప్రభాతవార్త): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో 12వ వార్డులో ప్రజా పాలనలో భాగంగా మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు అందేలా చూస్తామన్నారు. ఇప్పుడు రాని వారు మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందరికి అందాలన్నారు. ఈ కార్యక

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పథకాలు మంజూరు కాకుంటే దరఖాస్తు చేసుకోండి

-బాచేపల్లి గ్రామ సభలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నిజాంపేట, జనవరి 23, ప్రభాతవార్త: నియోజకవర్గంలోని ప్రతి అర్హుడికి సంక్షేమ పథకాలు అందిస్తామని, గ్రామసభలో పథకాలు(రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా) మంజూరు కాని వారు మరోసారి ధరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని బాచేపల్లిలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభలో ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు. 2023-24 సంవత్సరంలో ఉపాధి హామీలో 20 రోజులు పనిచేసి ఉండి ఎలాంటి వ్యవసాయ భూమి లేని వారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా మంజురు చేసి ఏడాదికి రూ. 12వేల మంజూరు చేస్తామన్నారు. అధికారులు పారదర్శకంగా జాబితాను పరిశీలించి అర్హులందరికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శంకర్ గౌడ్, ఎంపిడిఓ రమేష్ బాబు, తహసీల్దార్ నాగజ్యోతి, ఎంపిటి శ్రీనివాసులు, సొసైటీ చైర్మన్ సంగారెడ్డి దుర్గారెడ్డి, ఆర్ఐ జాన్సన్, బొజ్జం రమేష్ కుమార్, శ్రీకాంత్, ప్రవీణ్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికి సంక్షేమ పథకాలు

చౌటకూరు, జనవరి 23, ప్రభాతవార్త: మండల పరిధిలోని గంగోజిపేట,పోసన్‌పల్లి గ్రామాల్లో గురువారం నిర్వహించిన గ్రామసభలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నత్తి దశరథ్ పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హులందరికి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఈశ్వర్‌గౌడ్, గంగోజిపేట గ్రామ కమిటి అధ్యక్షులు బాలగౌడ్, యువత అధ్యక్షులు శ్రావణ్ కుమార్, రాజా గౌడ్, భాస్కర్, ఆక్బర్, మన్సూర్ అలీ, పోచంపల్లి గ్రామ కమిటి అధ్యక్షులు ఒన్నపురం ప్రభాకర్ ఉపాధ్యక్షులు సత్యం నాయకులు గోపాల్, ఇందిరమ్మ కమిటి సభ్యులు రాజు, వెంకట్, సంతోష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికి సంక్షేమ పథకాలు అందిస్తాం

దామర్‌గిద్దలో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి బలరాం

నాగల్‌గిద్ద, జనవరి 23, ప్రభాతవార్త: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల అందిస్తామని మండల ప్రత్యేక అధికారి బలరాం అన్నారు. గురువారం నాగల్‌గిద్ద, దామర్‌గిద్దలో నిర్వహించిన గ్రామసభల్లో పాల్గొని మాట్లాడారు. గ్రామ సభల్లో సంక్షేమ పథకాలు మంజూరైన వారి పేర్లు లేకుంటే మరోమారు ధరఖాస్తులు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ మహేశ్వర్‌రావు, సొసైటీ చైర్మన్ శ్రీకాంత్, ఇంచార్జి తహసీల్దార్ శివకృష్ణ, నాయకకులు గుండేరావు పాటిల్, పండరినాథ్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందచేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

జహీరాబాద్, జనవరి 23, ప్రభాతవార్త: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్షమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పి.నరసింహారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని కొత్తూర్(బి), బూచినెల్లి, శేఖాపూర్ తండాలలో నిర్వహించిన గ్రామసభల్లో నర్సింహారెడ్డి పాల్గొని మాట్లాడుతూ గ్రామసభలో సంక్షమే పథకాల లబ్ధిదారుల పేర్లు రాని వారు అర్హులై ఉంటే మరో మరు ధరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.రవీందర్, ఎంపిడిఓ మహేందర్‌రెడ్డి, రూరల్ ఎస్ఐ ప్రసాద్‌రావు, కాంగ్రెస్ నాయకులు అక్బర్ హుస్సేన్, జి మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, జగన్మోహన్, నాగు చౌహాన్, రవి చౌహాన్, ఖలీల్, దశరథ్, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

24 గ్రామపంచాయతీలు.. గ్రామసభలో 771 అర్జీలు



పాపన్నపేటలో నిర్వహిస్తున్న ప్రజా పాలన గ్రామ సభ దృశ్యం

పాపన్నపేట, జనవరి 23, ప్రభాతవార్త: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించేందుకే గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి సురేష్ పేర్కొన్నారు. గురువారం పాపన్నపేటలో నిర్వహించిన గ్రామసభకు డిపిఓ సురేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ రెండురోజులుగా మండలంలోని 24 గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించగా 771 ఆర్జీలు వచ్చాయని ఇందులో నూతన ఆహార భద్రత కార్డులు 241, ఆహార భద్రత కార్డుల్లో కుటుంబ సభ్యుల చేర్పుటకు 101, ఆహార భద్రత కార్డులు ఉండి మృతి చెందిన వారి కార్డుల తొలగింపుకు 43, ఇందిరమ్మ ఇండ్లకు 126, పెంకుటిండ్లు ఉండి ఇందిరమ్మ ఇళ్లకు 98, గృహ నిర్మాణానికి 91, స్థలం లేనిని ఇందిరమ్మ ఇళ్లకు 24, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి 41, రైతు భరోసాకు 6 ఆర్జీలు వచ్చాయన్నారు. ధరఖాస్తులు చేసుకున్న వారు అర్హులై ఉంటే సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. గ్రామ సభలలో పేర్లు లేని వారు అర్హులై ఉంటే మరోమారు ధరఖాస్తులు చేసుకోవాలన్నారు. మంజూరైన జాబితాలపై అభ్యంతరాలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాపాలన కాదు..మోసగించే పాలన : బిజెపి

రామాయంపేట, జనవరి 23, ప్రభాతవార్త : రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ నిర్వహిస్తున్న ప్రజాపాలన కేవలం ప్రజలను మోసగించే పాలనగా తయారైందని బిజెపి నాయకులు విమర్శించారు. రామాయంపేట మున్సిపాలిటీలోని 8వ వార్డులో బుధవారం నిర్వహించిన ప్రజాపాలన వార్డు సభలో ప్రభుత్వపథకాలు రేషన్‌కార్డు, ఇళ్ల దరఖాస్తుల గురించి అధికారులు ప్రజలకు అవగాహన, అనుమానాలు తెలపకపోగా, మున్సిపాలిటీ అధికారులు నిర్లక్ష్యంగా అక్కడి నుండి వెళ్లిపోవడం జరిగిందని బిజెపి నాయకుడు శంకర్‌గౌడ్ విమర్శించారు. అధికారుల వద్ద ఎలాంటి సమాచారం లేదని, ప్రజాపాలన అని పెట్టినప్పటికీ ప్రజలను మోసంచేసే విధంగా కార్యక్రమం పెట్టారన్నారు. ఒక వార్డులో రేషన్ కార్డులు ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు, ఎన్ని కుటుంబాలకు ఇచ్చారు, ఇళ్లకోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఎవరెవరికి ఇస్తున్నారన్న సమాచారం అధికారుల వద్ద లేదని తెలిపారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అధికారులు కొందరు రాజకీయ నాయకుల కోసం మాత్రమే పని చేస్తున్నారని, పేదలందరికీ ఇళ్లు, రేషన్ కార్డులు, 4000 పించన్లు అందించాలని భారతీయ జనతా పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామని శంకర్‌గౌడ్ తెలిపారు.

అధికార పార్టీ తొత్తుగా మున్సిపల్ కమిషనర్

మున్సిపల్ చైర్మన్ లతిత సోమిరెడ్డి



మాట్లాడుతున్న లలితసోమిరెడ్డి

రామచంద్రాపురం, జనవరి 23, ప్రభాతవార్త: మున్సిపాలిటీని ప్రగతి పథంలో నిలిపేందుకు ప్రణాళిక బద్ధంగా కృషిచేయాల్సిన మున్సిపల్ కమిషనర్ అధికార పార్టీకి తొత్తుగా మారి అభివృద్ధి పనులకు ఆటంకం కల్గిస్తున్నాడని మున్సిపల్ చైర్మన్ మల్లేపల్లి లలితసోమిరెడ్డి, బిఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్ మల్లేపల్లి సోమిరెడ్డి ఆరోపించారు. బుధవారం 17 కోట్ల 82 లక్షల రూపాయల అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలను ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డితో కలిసి చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో లలిత, సోమిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్య కమిషనర్ సంగారెడ్డి చిచ్చుపెడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర్‌కు కాంగ్రెస్ నాయకులు తప్పుడు సమాచారం చేరవేస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వసభ్య సమావేశంలో చేసిన తీర్మానానికి తిలోదకాలిస్తూ అధికార పార్టీకి వత్తాసు పలకడం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషన్ అభివృద్ధిని పట్టించుకోకుండా రాజకీయం చేయడం తగదని హెచ్చరించారు. మహిళా చైర్మన్ అయిన తనను ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వానించక పోవడం అవమానించడం కాదా అని నిలదీశారు. ప్రారంభోత్సవ శిలాపలకం లేకుండానే మున్సిపల్ కార్యాలయం పక్కన ప్రభుత్వ ఫంక్షన్ హాల్‌ను ప్రారంభోత్సవం చేయడం ఏమిటని ప్రశ్నించారు. మున్సిపల్ అభివృద్ధికి మంజూరైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పట్లోళ్ల రవీందర్‌రెడ్డి, బాలాజీ, శ్రీశైలం యాదవ్, చిట్టి ఉమేష్, సుచరిత కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.



అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంఖుస్థాపన చేస్తున్న దృశ్యం

కోటిన్నర నిధులతో అభివృద్ధి పనులకు శంఖుస్థాపన

జోగిపేట,జనవరి 23,ప్రభాతవార్త: అందోలు-జోగిపేట మున్సిపాలిటీపరిధిలోని 12వ వార్డులో కోటిన్నర నిధులతో పలు అభివృద్ధి పనులు గురువారం కౌన్సిలర్ కోరబోయిన నాగరాజు శంఖుస్థాపనచేశారు. టియుఎఫ్ఐడిసి నిధులు కోటి నలభై లక్షలతో రాజరాజేశ్వర ఆలయం నుంచి మెటల్‌కుంట వరకు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు, వార్డులో సిసి రోడ్లు, ఐమాస్ట్ లైటింగ్ పనులకు శంఖుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి దామోదర్ రాజనర్సింహ సహకారంతో వార్డు అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఎస్.జగన్మోహన్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మెన్ గూడెం మల్లయ్య, కమిషనర్ తిరుపతి, కౌన్సిలర్లు రంగనురేష్, సురేందర్‌గౌడ్, చందర్, దుర్గేష్, మాజీ కౌన్సిలర్లు పట్లోళ్ల ప్రవీన్‌కుమార్, గొల్ల శరత్‌బాబు, కాంగ్రెస్ నాయకులు గుర్రపు క్రిష్ణ, కొశికె రాజశేఖర్, చిట్యాల మధు పాల్గొన్నారు.

రామాయంపేటలో వార్డు సభ

మాట్లాడుతున్న వార్డు అధికారి రాజశేఖర్

రామాయంపేట, జనవరి 23, ప్రభాతవార్త : అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలన్నదే ప్రభుత్వం లక్ష్యంఅని రామాయంపేట మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. ప్రజాపాలనలో భాగంగా గురువారం స్థానిక పదవ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా అధికారులు ప్రజల వద్ద నుండి కొత్త రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ యోగ్యం గల భూములకు రైతు భరోసా, అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందించాలని ప్రభుత్వం దృఢసంకల్పంతో ఉందన్నారు. రేషన్ కార్డులో మార్పులు చేర్పులు ఉంటే మీ సేవలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు అధికారి రాజశేఖర్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు ఎనిశెట్టి అశోక్ గుప్తా పాల్గొన్నారు.

గ్రామ సభలకు పోటెత్తుతున్న జనం

చక్రియాల్‌లో కొనసాగుతున్న గ్రామ సభ

పుల్‌కల్, జనవరి 23, ప్రభాతవార్త: మండల పరిధిలోని హన్మానాయక్ తండా, మిన్‌పూర్ తండా, పెద్దారెడ్డిపేట, పోసానిపల్లి, చక్రియాల్, ముదిమాణిక్యం, గంగోజిపేట, గొంగ్లూరు గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభలకు ప్రజలు పొటెత్తారు. సంక్షేమ పథకాలకు ధరఖాస్తులు చేసుకునేందుకు ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. గ్రామసభలో లబ్ధిదారుల పేర్లు చదివి వినిపించారు. చక్రియాల్‌లో జరిగిన గ్రామసభలో ఎంపిటి ఆర్ శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి నర్సింలు, కాంగ్రెస్ గ్రామఅధ్యక్షుడు చిన్నరోళ్లపాటి రాజశేఖర్, మాజీ సర్పంచ్ అందోల్ కృష్ణ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు విజయ్ భాస్కర్‌రెడ్డి, నీరుడి లక్ష్మీనారాయణ ముదిరాజ్, బోడపట్ల ఆనందం, రోళ్లపాటి కమలమ్మ, చింతకుంట అనిత, ఆలయ కమిటి చైర్మన్ భానూని లక్ష్మయ్య, డైరెక్టర్లు మన్నె నర్సింలు, రోళ్లపాటి సత్యనారాయణ, అంజిరెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యులు తుంగె పండరి, రోళ్లపాటి పండరి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులను పరిశీలించిన నాయకులు

మునిపల్లి, జనవరి 23, ప్రభాతవార్త: మండల పరిధిలోని తాటిపల్లి నుంచి కంకోల్ వరకు 3.90 కోట్ల రూపాయలతో కొనసాగుతున్న రోడ్డు నిర్మాణ పనులను మాజీ ఎంపిపి అధ్యక్షులు రామ్‌రెడ్డి గురువారం పరి శీలించారు. ఈ సందర్భంగా రామ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి దామోదర్ రోడ్డు నిర్మాణానికి 3.90 కోట్లు మంజూరు చేయించారని పేర్కొన్నారు. మంజూరైన నిధులతో రోడ్డు నిర్మాణం పనులు కొనసాగుతున్నాయన్నారు. రోడ్డు నిర్మాణం పనులు పూర్తయితే ప్రయాణీకులకు సౌకర్యం కల్గుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంజిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఏడాకులపల్లి సురేష్, మారుతి తదితరులు ఉన్నారు.

పాడి రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందచేస్తున్న దృశ్యం

పాడి రైతులకు ప్రోత్సాహక బహుమతులు

సిర్గాపూర్, జనవరి 23, ప్రభాతవార్త: మండల పరిధిలోని పోట్‌పల్లి గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విజయడైరీ నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరానికి చేరుకున్న రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందచేశారు. అంతకుముందు శిబిరానికి చేరుకున్న పశువులకు పశువైద్యాధికారి డాక్టర్ జెసి క్రాంతి పశువులకు గర్భస్థ పరీక్షలు, సాధారణ చికిత్సలు నిర్వహించి మందులను అందచేశారు. పాడి పశువులకు లేగ దూడల పోషణ గురించి రైతులకు అవగాహన కల్పించారు. శిబిరానికి చేరుకున్న 12 పశువులకు గర్భస్థ పరీక్షలు, 2 పశువులకు గర్భదారణ టీకాలు, 16 పశువులకు సాధారణ చికిత్సలు, 33 దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. ఉత్తమ పాడి రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందచేశారు.ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి క్రాంతి, సూపర్‌వైజర్ తుక్కారెడ్డి, గోపాల మిత్ర సుమంత్, విజయడైరీ ఏజెంట్ వెంకట్‌రెడ్డిలను పాడి రైతులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో విజయడైరీ సూపర్ వైజర్ గంగారెడ్డి, మాజీ సర్పంచ్ గంగుబాయి తనయుడు వెంకట్ పాటిల్, గోపాల మిత్రలు సుమంత్, రాజేందర్, నాగ్‌గొండ, మోహిన్, శివరాజ్, పాడి రైతులు పాల్గొన్నారు.

ప్రజా పాలనపై ప్రజల నిరసన

నస్కల్ గ్రామం ప్రజా పాలనలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

రామాయంపేట, జనవరి 23, ప్రభాతవార్త : రామాయంపేట, నిజాంపేట మండలాల్లో బుధవారం నిర్వహించిన ప్రజా పాలన గ్రామసభల్లో నిరసన కార్యక్రమాలు కొనసాగాయి. రామాయంపేట మండలం ఝాన్సీ లింగాపూర్‌లో నిర్వహించిన గ్రామసభలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని గ్రామస్తులు అధికారుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పందించిన రామాయంపేట ఎంపీడీవో సాజులోద్దీన్ పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి అసలైన అర్హులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మరోవైపు నిజాంపేట మండలం నస్కల్ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో గ్రాస్తులు నిరసన తెలిపారు. తమ గ్రామానికి రోడ్డు నిర్మాణం చేపట్టాలని 15 రోజులుగా దీక్షలు చేస్తున్న అధికారులు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతు వేదిక వదనద నిర్వహించిన గ్రామసభను బహిష్కరించి నిరసన తెలిపారు. ఇప్పటికైనా తమకు ప్రభుత్వం రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

-5వందల మంది యువకులకు ఉద్యోగాలు

జహీరాబాద్, జనవరి 23, ప్రభాతవార్త: మాజీమంత్రి స్వర్గీయ మహమ్మద్ ఫరీదుద్దీన్ ఆశయ సాధన కొరకు మేగా జాబ్ మేళాను నిర్వహించినట్లు మాజీ టిఎస్ ఐడిసి చైర్మన్ మహ్మద్ తన్వీర్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఫ్రెండ్స్ కళ్యాణ మండపంలో మహమ్మద్ ఫరీదుద్దీన్ మెమోరియల్ మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని ఫరీదుద్దీన్ తనయ డాక్టర్ ఆసియా తంజీంతో కలిసి జాబ్ మేళాను తన్వీర్ ప్రారంభించారు. జాబ్ మేళాలో 110 పరిశ్రమల నిర్వాహకులు 600మందికి పైగా యువకులను ఉద్యోగాల కొరకు ఎంపిక చేసుకోవడం జరిగింది. 360 మంది యువకులకు స్పాట్‌లోనే నియామక పత్రాలు అందచేశారు. ఉద్యోగల కొరకు ఎంపికైన వారికి మరో వారం రోజుల్లో నియామక పత్రాలు అందచేయనున్నట్లు నిర్వాహకులు మహమ్మద్ ఇమ్రన్, కాంగ్రెస్ నాయకులు కుతుబుద్దీన్ జాంగర్, బాసిత్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిఎస్ ఐడిసి మాజీ చైర్మన్ ఎండి తన్వీర్

అర్హులకు సంక్షేమ పథకాలు అందడం లేదు

పుల్‌కల్, జనవరి 23, ప్రభాతవార్త:

ప్రజలను గోల్‌మాల్ చేసేందుకు, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్దిపొందేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుయుక్తులు పన్నుతోందని బిఆర్ఎస్ నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె సంజీవయ్య, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కాళపాగ ఇమ్మయ్య ఆరోపించారు. మండల పరిధిలోని తాద్దాన్‌పల్లి చౌరస్తాలో గురువారం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వహయాంలో అర్హులైన పేదలు సంక్షేమ పథకాలు, సహాయం అందడం లేదని మండిపడ్డారు. ఎన్నికల సందర్భంగా హామీలు చేసి అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ మాటలకే పరిమితం అవుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఏడాడి ఫిబ్రవరిలో ప్రజాపాలన దరఖాస్తుల పేరుతో లబ్దిదారుల నుంచి తీసుకున్నారని, వాటికే దిక్కు లేకుండాపోయాయని ఎద్దేవ చేశారు. ప్రజా పాలన, కుల గణన గ్రామ సభలు అంటూ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను గోల్ మాల్ చేసేందుకు గ్రామసభలను నిర్వహిస్తోందని మండిపడ్డారు. తాజాగా ప్రకటిస్తున్న 4 సంక్షేమ పథకాలు తాత్కాలికంగా ప్రజలను మభ్యపెట్టేందుకు అని ఆరోపించారు. రైతు భరోసా ఏడాదికి ఎకరానికి 15 వేల ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ మాటను మార్చి ఇప్పుడు 12 వేలకు కుదించడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఎర్రోళ్ల పోచయ్య, డాకూరి ప్రశాంత్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ పల్లె సంజీవయ్య

మాజీ మంత్రి హరీష్‌రావును కలిసిన బిఆర్ఎస్ రాష్ట్ర నేత ఆదర్శ్‌రెడ్డి

మాజీ మంత్రిని కలిసిన ఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం, జనవరి 23, ప్రభాతవార్త: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తీన్నరు హరీష్‌రావును గురువారం బిఆర్ఎస్ నాయకులు వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఫిబ్రవరి 2న కాట సునీతరాజుగౌడ్ ఆధ్వర్యంలో అమీన్‌పూర్‌లో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి హాజరు కావాలని ఆదర్శ్‌రెడ్డి హరీష్‌రావును కోరగా సానుకూలంగా స్పందించినట్లు ఆదర్శ్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, బిఆర్ఎస్ నాయకులు రాజేష్‌గౌడ్, సోషల్ మీడియా ఇంచార్జి రవి కిరణ్‌రెడ్డి, యూత్ నాయకులు మానిక్ యాదవ్ తదితరులు ఉన్నారు

నిజాంపేట జడ్పీహెచ్ఎస్‌లో క్రీడా పోటీలు

నిజాంపేట, జనవరి 23, ప్రభాతవార్త: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు నిర్వహిస్తున్న ఆటల పోటీలు కొనసాగుతున్నాయి. గురువారం ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రావు కబడ్డీ పోటీకి టాస్ వేసి ప్రారంభించారు. మొదట సీనియర్ బాలుర కబడ్డీ పోటీలో 10వ తరగతి విద్యార్థి సునీల్ బృందం విజయం సాధించింది. క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఈనెల 26న గణతంత్ర దినోత్సవం రోజున బహుమతులు అందచేయడం జరుగుతుందని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా కార్యదర్శి, ఉపాధ్యాయులు శ్రీనివాస రాథోడ్, దేవి సింగ్ గురూజీ, విజయ్‌కుమార్, హరి, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, కాశీనాథ్, రాజు, భారతి, విజయలక్ష్మి, సురేఖ, భ్రమరాంబ, సుశీల, ప్రవీణ్ కుమార్, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖాసీంపూర్‌లో పాత పంటల జాతర

జహీరాబాద్, జనవరి 23, ప్రభాతవార్త: మండల పరిధిలోని ఖాసీంపూర్ గ్రామంలో గురువారం డిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 25వ పాత పంటల జాతరను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చేరుకున్న పాత పంటల జాతరను రైతులు మంగళహారతులతో స్వాగతం పలికారు. పాత విత్తనాలతో అందంగా అలంకరించిన ఎడ్లబండ్లను గ్రామస్థులు పూజలు నిర్వహించి ఆటలు ఆడుతూ పాటల పాడుతూ గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. పాత పంటల ఆహారంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని డిడిఎస్ మహిళా సంఘాల బాధ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిడిఎస్ బాధ్యులు ఎన్.నర్సింలు, మల్లేషం, బాలయ్య, చుక్కమ్మ, ప్రహ్లాద్, సంతప్, పూలమ్మ, చిన్న నర్సమ్మ, గొల్ల మల్లేశం, గొల్ల అంజన్న, కవితమ్మ, లచ్చమ్మ, రాములమ్మ, జాతర కో-ఆర్డినేటర్ వినయ్ కుమార్, మంజుల, పశు సంవర్ధక శాస్త్రవేత్త డాక్టర్ కైలాష్ పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎఎస్ఐ

హుస్నాబాద్ టౌన్, జనవరి 22, ప్రభాతవార్త : అపరిచిత వ్యక్తుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ మల్లేశం అన్నారు.గురువారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు షీటీమ్ ఆధ్వర్యంలో సైబర్‌నేరాలు, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, ఈవిటీజింగ్, నూతన చట్టాలు, మహిళాచట్టాలు, షీటీమ్, దాని ప్రాముఖ్యత, ఫోక్సో, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి హాజరైన మల్లేశం మాట్లాడుతూ మనిషి జీవితంలో విద్యార్థి దిశ కీలకమైనదని, ఈ సమయంలో చెడు వ్యసనాలకు అలవాటుపడి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి, మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరండా ఉంటూ క్రమశిక్షణతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వాసుదేవరెడ్డి, ఉపాధ్యాయులు, షీటీమ్ సదయ్య, ప్రశాంతి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందచేసిన ఎమ్మెల్యే

ఝరాసంగం, జనవరి 23, ప్రభాతవార్త: అనారోగ్యానికిగురైన వారు కార్పొరేట్ ఆసుపత్రుల్లో మెరుగైనచికిత్సకు గురువారం రూ.3 లక్షల సిఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అందచేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు వెంకటేశం, మాజీ సర్పంచ్ బొగ్గుల జగదీశ్వర్, సంగమేశ్వర్, ఎంపి నాగేష్, ఎజాజ్ బాబా పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

సిర్గాపూర్, జనవరి 23, ప్రభాతవార్త: మండల పరిధిలోని కిషన్‌నాయక్ పంచాయతీ పరిధిలోగల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సంఘర్త ఎంపవర్మెంట్ ఫౌండేషన్ ద్వారా స్కూల్‌బ్యాగ్‌లు గురువారం అందచేశారు. విద్యార్థులకు బ్యాగులు అందచేసిన ఫౌండేషన్ బాధ్యులకు గ్రామస్థులు కృతజ్